GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : మంగళవారం- నవంబర్ 28-2023 పేజీలు : 3



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోడీ

**టీ మీడియా, నవంబర్ 27, తిరుమల:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి విరామ సమయంలో శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ మహాద్వారం దగ్గర టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయక మంటపంలో వేద పండితులు వేధ ఆశీర్వచనం ఇవ్వగా, టిటిడి చైర్మన్, ఈఓలు స్వామి వారి చిత్ర పటాన్ని బహుకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక తిరుమలలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలలో శ్రీవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఆలయంలో కేంద్ర బలగాల మోహరించారు. డ్యూటీ పాస్ ఉన్నవారికే ఆలయంలోకి అనుమతించారు.

## మహానందీశ్వరుని పల్లకి సేవలో విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి

**టీ మీడియా, నవంబర్ 27, మహానంది:**



మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ గంగా, కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లకి సేవలో సోమవారం రాత్రి విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పాల్గొన్నారు. ముందుగా మహానందీశ్వర స్వామి దర్శనం కోసం వచ్చిన ఆయన ను ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు, అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అలంకార మండపంలో నిర్వహించిన పల్లకి సేవ ఉత్సవంలో పాల్గొన్నారు.

## రైతుల నోటికాడి బుక్కను గుంజుకున్న కాంగ్రెస్

- ఎమ్మెల్సీ కవిత

**టీ మీడియా, నవంబర్ 27, నిజామాబాద్:**



కాంగ్రెస్ పార్టీ తన రైతు వ్యతిరేక విధానాన్ని మరోసారి రుజువు చేసుకున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. రైతుల నోటికాడ బుక్కను గుంజుకుందని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు వెంబటబడి రైతు బంధును నిలిపివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. రైతు బంధు ఎన్నికల కోసం పెట్టిన పథకం కాదని చెప్పారు. ఇప్పటికే రూ.72 వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల ఖాతాల్లో వేశామన్నారు. రైతులంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారన్న

మిగతా 2 లో

## కొల్లాపూర్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి బర్రెలక్కకి సంఘీభావం

**టీ మీడియా, నవంబర్ 27, మహానంది:**



తెలంగాణ రాష్ట్రం కొల్లాపూర్ స్వతంత్ర ఎమ్మెల్యేఅభ్యర్థి బర్రెలక్క కొల్లాపూర్ దగ్గర కుడికల్ గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఎంవీఆర్పీఎస్ నేతలు సోమవారం ఆమెను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, గాజులపల్లె రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరామ్ మాట్లాడుతూ.. పేదింటి నిరుద్యోగ యువతి తను ఎమ్మెల్యే గా పోటీ చెయ్యటం ద్వారా ఈ ప్రపంచంలోని, మేధావులను తనవైపు తిప్పుకొని, దేశంలోని తెలుగు రాష్ట్రాల మీడియాను తనవైపుకు సూచేలా చేసుకున్న స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క అని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు మీనిగ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ రోడ్ షో..

- జన సంద్రమైన భాగ్యనగరం

**టీ మీడియా, నవంబర్ 27,హైదరాబాద్:**



తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి ఫినిషింగ్ టచ్ ఇస్తున్నారు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. భారీ ర్యాలీతో తన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగించారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ మెగా రోడ్ షో చేపట్టారు. గంటపాటు ఈ రోడ్ షో కొనసాగింది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి కాచిగూడ వీర సావర్కర్ విగ్రహం వరకు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించారు ప్రధాని మోదీ. కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం దగ్గర ప్రధాని మోదీ ప్రసంగం అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకున్నారు.మహబూబాబాద్ సభలో బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు ప్రధాని మోదీ. తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ కబంధ హస్తాల నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ నేతలను తప్పకుండా జైలుకు పంపిస్తామన్నారు ప్రధాని మోదీ. తెలంగాణకు తప్పకుండా తొలి బీసీ ముఖ్యమంత్రిని అందిస్తామన్నారు మోదీ. బీజేపీ పెరుగుతున్న శక్తి అని కేసీఆర్ చాలా కాలం క్రితమే గ్రహించారని అన్నారు. బీజేపీతో ఎలాగైనా దోస్తీ చేయాలని కేసీఆర్ చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా బీజేపీ ఎప్పటికీ ఏమీ చేయదన్నారు. కేసీఆర్‌ను బీజేపీ తిరస్కరించినప్పటి నుంచి బీఆర్ఎస్ భయాందోళనకు గురవుతోందన్నారు.అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ బరిలోకి దిగిన కరీంనగర్ నియోజకవర్గంలోనూ ప్రధాని మోదీ భారీ బహిరంగసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ తొలి ముఖ్యమంత్రి బీసీయే అవుతారని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ప్రస్తుతం తెలంగాణ వయస్సు పదేళ్లని.. వచ్చే ఐదేళ్లు తెలంగాణ భవిష్యత్తుకు కీలకమని అన్నారు ప్రధాని మోదీ. వచ్చే ఐదు సంవత్సరాల్లో దేశంలోనే నెంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో మార్పు గాలి వీస్తోందని.. మార్పు తథ్యమని అన్నారు.ప్రజలను మోసం చేసేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ బీఆర్ఎస్, కాంగ్రెస్ వదిలిపెట్టలేదన్నారు ప్రధాని మోదీ. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తీవ్రవాద సంస్థలకు ఊతం లభిస్తుందన్నారు. బీజేపీ మాత్రమే దేశ ప్రతిష్ఠను పెంచుతుందనమోదీ స్పష్టం చేశారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని ప్రయత్నించామని.. కానీ బీఆర్ఎస్ ?సర్కార్ అడ్డుకుందని మోదీ ఆరోపించారు. రైతులకు నీళ్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ లక్షల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కుటుంబం అవినీతి అన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ.తెలంగాణ ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ చలోక్తులు, చమత్కాలతో పాటు తెలుగు భాషలో మాట్లాడి ఓటర్లను తెగ ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, కేసీఆర్ ఒక్కటే. నీళ్లు, నిధులు, నియామకాలు అని నినదించిన కేసీఆర్ పదేళ్లలో చేసిందేంటి? వీటిని స్పష్టమైన తెలుగులో చెప్పారు.

బీజేపీ వస్తే మోదీ గ్యారెంటీ ఎలా ఉంటుందో, అసలు మోదీ గ్యారెంటీ ఏంటో కూడా తెలుగులోనే చెప్పుకొచ్చారు.119 అసెంబ్లీ స్థానాలున్న తెలంగాణలో ఈసారి బీజేపీ తన సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ సీనియర్ నేతలు భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం ప్రధాని మోదీ మహబూబాబాద్, కరీంనగర్‌లో ర్యాలీలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లో ప్రధాని మోదీ రోడ్‌షో చేపట్టారు. అదే సమయంలో, హోంమంత్రి అమిత్ షా కూడా సోమవారం తెలంగాణలో రెండు రోడ్ షోలు, ర్యాలీలో ప్రసంగించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఇవాళ మూడు ర్యాలీలు, రోడ్ షోల్లో పాల్గొన్నారు.

## 10 రోజుల్లో వస్తాం.. రూ.15వేల రైతు భరోసానిస్తాం

- టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 27, హైదరాబాద్ :**



తెలంగాణలో 'రైతు బంధు' సాయం పంపిణీకి ఇచ్చిన అనుమతిని కేంద్ర ఎన్నికల సంఘం ఉపసంహరించుకోవడంపై టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పందించారు. సోమవారం మీడియాతో రేవంత్ మాట్లాడుతూ.. రైతుబంధుతో ఓట్లు దండుకోవాలన్న దురాశ, ఆత్రుత మాత్రమే బిఆర్ఎస్ నేతలకు ఉందని విమర్శించారు. మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యల వల్ల రైతుబంధుకు ఈసీ అనుమతి రద్దు చేసిందని.. ఆ వ్యాఖ్యలే కారణమని ఈసీ చెప్పిందని ఆరోపించారు. హరీశ్‌రావు నియమావళిని ఉల్లంఘించారని ఈసీ పేర్కొందని అన్నారు. నిజంగా రైతులకు మేలు చేసే ఉద్దేశం సిఎం కెసిఆర్, హరీశ్‌కు లేదని చెప్పారు. కాగా ఈసీ అనుమతి ఇచ్చిన తర్వాత మంత్రి హరీష్ రావు ఓ సభలో మాట్లాడుతూ.. ఉదయం రైతులు చాయ్ తాగే సమయానికి మీ ఫోన్లలో టింగ్ టింగ్ టింగ్ టింగ్ అంటూ రైతు బంధు పడ్డ మెస్సేజ్ లు వస్తాయని కామెంట్స్ చేశారు.. వీటికి పరిగణలోకి తీసుకున్న ఈసీ రైతు బంధు పర్మిషన్ ను రద్దు చేసింది. రాష్ట్రంలో రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దు అని అన్నారు. 10 రోజుల్లో కాంగ్రెస్ రాగానే రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## రైతు బంధును కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నది

- అసదుద్దీన్ ఓవైసీ

**టీ మీడియా, నవంబర్ 27, హైదరాబాద్:**



రైత బంధు స్కీమ్ కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జరిగే నగదు బదిలీని ఎన్నికల సంఘం నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే ఆ స్కీమ్ కింద డబ్బులు రైతులకు చేరకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నదని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రైతు బంధును కాంగ్రెస్ అడ్డుకున్నదని, ఆ స్కీమ్ చాలా ఏళ్ల నుంచి అమలులో ఉందని, ఇప్పటికే అమలులో ఉన్న స్కీమ్‌ను ఎందుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని ఎంపీ అసద్ ప్రశ్నించారు. ఒకవేళ ఇది కొత్త స్కీమ్ అయి ఉంటే, అప్పుడు దాని గురించి భిన్నంగా ఆలోచించే అవకాశం ఉంటుందని, ఇదేమీ కొత్త స్కీమ్ కాదు అని, అకస్మాత్తుగా ఆ స్కీమ్‌ను అడ్డుకోవడం అంటే, రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా ఉందని స్పష్టమవుతోందని అసదుద్దీన్ అన్నారు. రైతు బంధును అడ్డుకోవడం అంటే .. కాంగ్రెస్ పార్టీ తప్పుడు సంకేతాలు పంపుతున్నట్లు తెలుస్తోందని అసద్ ఆరోపించారు.

## కామారెడ్డి, గజ్వేల్ లో కెసిఆర్ ఓటమి తధ్యం..

- కమల వికాసం ఖాయం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**టీ మీడియా, నవంబర్ 27, హైదరాబాద్ :**



అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్, కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓడిపోతున్నారని.. ఈ రెండు చోట్ల ప్రజల నుంచి భాజపాకు అద్భుత స్పందన వస్తోందని చెప్పారు. ఈ రెండు చోట్లా బీజెపి అభ్యర్థులు గెలుస్తున్నారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ తెలంగాణకు ప్రమాదకరమని సీరియస్ కామెంట్స్ చేశారు. రైతుబంధు విషయంలో బిఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నదని, ఎన్నికల వస్తున్నాయని తెలిసినా రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేశారని పేర్కొన్నారు.. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సూటుకేసుల ప్రభుత్వం వస్తుంది. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణను పాలించిన తీరు, కేంద్రంలో బీజేపీ పాలన తీరును బేరీజు వేసుకుని ఓటు వేయండి. మోదీని అడ్డుకోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి డ్రామాలు చేస్తున్నాయి. కేసీఆర్ పోటీ చేసిన రెండు చోట్లలో ఓడిపోతారు. బీజేపీ అక్కడ విజయం సాధిస్తుంది. కామారెడ్డిలో కేసీఆర్‌ను గెలిపించడానికి రేవంత్ రెడ్డి పోటీచేస్తున్నారు. తెర వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసిన తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటారు. బీజేపీ కమిట్మెంట్‌ను మ్యానిఫెస్టో రూపంలో తెలంగాణ ప్రజల ముందు పెట్టాం. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వలేదు. కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్, కేసీఆర్ మైనార్టీలకు ఇచ్చిన హామీలు ఒక్కటే. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడి హామీలు ఇస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధమైన హామీలు . ముస్లీం ఐటీ టవర్స్ కట్టడం ఏంటి?. సాఫ్ట్ వేర్ రంగంలో కూడా కేటీఆర్ మతాన్ని జొప్పిస్తున్నారు అంటూ నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పాతబస్తీ ఎందుకు అభివృద్ధి చేయలేదు?. ఇన్నాళ్లు పాతబస్తీ యువతకు ఉపాధి అవకాశాలు ఎందుకు కల్పించలేదు. పాతబస్తీలో అక్షరాస్యత శాతం ఎందుకు తక్కువగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒవైసీ కుటుంబానికి అండగా ఉన్నాయి తప్ప.. సామాన్య ముస్లీం సమాజానికి ఏం చేయలేదు. ఒవైసీ కుటుంబం శాసిస్తే కేసీఆర్ ఏదైనా చేస్తారు. పాతబస్తీ ప్రజలు చదువుకుంటే ఒవైసీ కబంధ హస్తాల నుంచి బయటకు వస్తారని అక్షరాస్యత పెంచకుండా చూస్తున్నారు. పాతబస్తీకి మెట్రో వసతి ఎందుకు కల్పించలేకపోయారు. దారుసలాంను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం దారాదత్తం చేసింది' అంటూ విమర్శించారు.

## కెసిఆర్ పాలనలో వారి నేతలకు ఇంద్రభవనాలు

- పేదలకు మాత్రం పూరి గుడిసెలు
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

**టీ మీడియా, నవంబర్ 27, యాదాద్రి :**



ప్రజా పాలన కోసం కాంగ్రెస్ పోరాడుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. సోమవారం యదాద్రిభువనగిరి జిల్లాలోని ఎన్నికల ప్రచారం లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్ కుమార్ రెడ్డి గెలుపు కోరుతూ భువనగిరి పట్టణ కేంద్రంలో ఏర్పటు చేసిన కార్నర్ మీటింగ్ లో పాల్గొని మాట్లాడారు. భాజపా, భారాస, అన్నదమ్ములని, వారి చిన్న తమ్ముడు ఎంఐఎం అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దొరికి కాడికి దోచుకున్న ప్రభుత్వాలకు చరమ గీతం పడాలన్నారు. నోట్ల రద్దు, కరోనా, జిఎస్టీ లతో సామాన్యులు ఇబ్బందులు పాలయ్యారని, ప్రజా సమస్యలను ఏనాడు కూడా పట్టించుకోలేదన్నారు. అధికారం కోసం పాకులాడే పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటు పడేదే కాంగ్రెస్ అన్నారు. వారి సంక్షేమం కోసం కార్పొరేషన్ లను ఏర్పాటు చేస్తామన్నారు

తెలంగాణ కోసం ఎంతోమంది తమ రక్తాన్ని, ప్రాణాన్ని దారపోసారని, తల్లి సోనియా గాంధీ తో రాష్ట్రం ఏర్పాటు చేస్తే నేడు ఎట్లా ఉందొ మీరే అర్థం చేసుకోవాలన్నారు. నీళ్లు లేవు, నిధులు లేవు, నియామకాలు లేవన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ లో ఏవిధంగా ప్రజా పాలన ఉందొ తెలంగాణ లో కూడా అలాగే ఉంటుందన్నారు. కాంగ్రెస్ ను ఆదరించాలని కోరారు.రాహుల్ గాంధీ ఒక శక్తి అని, దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నత వరకు ఎవ్వరు ఏమి చేయారన్నారు. కాంగ్రెస్ తోనే గె ప్రజా పరిపాలన సాధ్యమన్నారు. తెలంగాణ ప్రజలు రెండుసార్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ ఏం చేసింది. తెలంగాణలో అత్యాచారాలు, రైతుల అత్మహత్యలు పెరిగాయి. కాంగ్రెస్ కు ఒక్క ఛాన్స్ ఇస్తే అభివృద్ధి ఎంటో చూపిస్తాం. బీఆర్ఎస్ సర్కారు నుంచి పేదలకు ఏమీ రావడం లేదు రైతు రుణమాఫీ కాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. చిన్న చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ధరల పెరుగుదలను ప్రభుత్వం పట్టించుకోలేదు. తెలంగాణ ప్రజలు ఆలోచించాల్సిన అవసరం వచ్చింది. తెలంగాణ వచ్చాక యువకుల ఆకాంక్షలు నెరవేరలేదు. బీఆర్ఎస్ మంత్రలు, ఎమ్మెల్యేలు ఫామ్ హౌస్ లు కట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6 గ్యారెంటీలను అమలు చేస్తాం.

ట్రిబుల్ ఆర్ బాధితులకు అండగా పోరాడుతాం. తెలంగాణ కోసం యువత త్యాగం చేసింది. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రజల జీవితమే ఆగమైతది . మళ్లీ కేసీఆర్ వస్తే.. భూములు మాయం.. నిరుద్యోగులు ఆగం. కాంగ్రెస్ తోనే ప్రజల పాలన.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తం.. ఇళ్లు కట్టుకోడానికి రూ. 5 లక్షలు. మహిళలకు ప్రతి నెల రూ. 2 వేల 500. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 200 యూనిట్ల ఉచిత కరెంట్.. రైతురూణమాఫీతో పాటు వరికి మద్దతు ధర.. పేదలకు రూ. 4 వేల పెన్షన్.. ఇందిరమ్మ రాజ్యం తీసుకోస్తాం. అధికారంలోకి రాగానే వరుస జాబ్ నోటిఫికేషన్లు ఇస్తామంటూ' ప్రియాంకా గాంధీ వరాలు కురిపించారు. ఈ సమావేశంలో మాణిక్యం ఠాకూర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు కావాలంటే కాంగ్రెస్ ఖతం కావాలి

- మంత్రి హరీశ్ రావు

**టీ మీడియా, నవంబర్ 27, జహీరాబాద్:**




రైతుబంధు కావాలంటే కాంగ్రెస్ ఖతం కావాలని మంత్రి హరీశ్ రావు అన్నారు. రైతుబంధు పంపిణీని ఆపిన కాంగ్రెస్‌కు ఓటుతోనే పోటు పొడవాలని చెప్పారు. ఆ పార్టీని గ్రామ పొలిమేర నుంచి తరిమికొట్టాలని తెలిపారు. ఆ పార్టీనేత మెదక్ జిల్లా జహీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రైతుబంధును బంద్ చేయిస్తున్నారని అన్నారు. రైతుల నోటికాడి బుక్కను అడ్డుకుంటారా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రైతులతో తమది ఓటు బంధం కాదని పేగు బంధమని చెప్పారు. తాను మీటింగ్‌లో న్యాయం గెలిచిందని.. రైతుబంధుకు ఈసీ క్లియరెన్స్ ఇచ్చిందన్నాను.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని.. రైతుబంధు ఇస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ 11 సార్లు పంటపెట్టుబడి సాయం ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ నేత నిరంజన్ ఫిర్యాదుతో రైతుబంధును ఎన్నికల కమిషన్ ఆపిందన్నారు. రైతు బంధు కథం కావాలా.. కాంగ్రెస్ కథం కావాలా? అని ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. సంగమేశ్వర ప్రాజెక్టుతో గోదావరి నీళ్లు జహీరాబాద్ రైతుల కాళు కడుగుతామని చెప్పారు. రిస్కువద్దు కారుకు ఓటు గుద్దు అనిచెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి అనుకోకుండా గెలిచినా బీజేపీలోకి వెళ్తాడన్నారు.



## సమానత్వాన్ని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి గురునానక్

- మంత్రి తలసాని

**టీ మీడియా, నవంబర్ 27, హైదరాబాద్ :**

కుల, మతాలను వీడి సమానత్వాన్ని చాటాలని చెప్పిన గొప్ప మహనీయుడు గురునానక్ అని సనత్‌నగర్ బీఆర్స్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం గురునానక్ జయంతి సందర్భంగా అమీర్‌పేటలోని గురుద్వార్‌ను దర్శించుకొని సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ప్రార్థనలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గురునానక్ దేవ్ సిక్కు మతాన్ని స్థాపించి మనిషి జీవితంలో పెను మార్పులను తీసుకురాగల బోధనలను అందించారన్నారు. అందరూ సంక్షేమ కార్యక్రమాలు చేయాలని, దురాశను విడిచిపెట్టి నైతికంగా డబ్బు సంపాదించాలని గురునానక్ ప్రబోధించారు. ఇతరుల హక్కులను ఎప్పుడూ హరించకూడదని పేర్కొన్నారు. డబ్బును సంపాదించి ఇతరుల సంక్షేమానికి వినియోగించాలని చెప్పిన మహోన్నత వ్యక్తి గురునానక్ అని కొనియాడారు. సిక్కుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు.

## మహానంది క్షేత్రంలో కార్తీక శోభ..

- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రం

**టీ మీడియా, నవంబర్ 27, మహానంది:**



మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం పురస్కరించుకొని రెండవ సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుండి భక్తుల రద్దీ కొనసాగింది. మహానంది క్షేత్రానికి వచ్చిన భక్తులు కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీకదీపాలు వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎంతో పవిత్రమైన కార్తీక సోమవారం కావడంతో క్షేత్రానికి వచ్చిన భక్తులు ఎక్కువ శాతం స్వామి వారికి అభిషేకము అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. క్షేత్రంలో శివనామ స్మరణలతో మారుమోగిపోయింది. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. ఆలయ అధికారులు భక్తుల రద్దీ దృష్ట్యా పార్కింగ్ స్థలాలలో వాహనాలు ఆపి వేసి, దర్శనాల కోసం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేయడం జరిగింది. క్షేత్రానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ప్రసాద వితరణ, మధ్యాహ్న సమయంలో అన్న ప్రసాద వితరణ దాతలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, అభిషేకం చేయించుకునే భక్తుల కోసం సామూహిక అభిషేకాలు ఏర్పాటు చేయడం జరిగింది. క్షేత్రంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి సాయంత్రం వరకు కూడా భక్తుల రద్దీ కొనసాగింది.

## రైతుల నోటికాడి బుక్కను గుంజుకున్న కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**

అభద్రతలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని విమర్శించారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ మరోసారి రైతులను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించిందన్నారు. అన్నదాతలంతా ఓటు ద్వారా ఆ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. రైతుబంధు కావాలా.. రాబందులు కావాలా అని ప్రశ్నించారు. మతం పేరుతో ఒక పార్టీ, కులం పేరుతో మరోపార్టీ నడుస్తున్నదని విమర్శించారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక ముసాయిదా తయారు చేస్తామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో నిరుపేదలకు వరమని చెప్పారు. బీఆర్ఎస్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలన్నారు. విభజన హామీలపై కాంగ్రెస్ నాయకులు ఏనాడూ మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణపై కేంద్ర విషం చిమ్ముతున్నదని చెప్పారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా కేంద్రం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ వెయ్యి బుల్డోజర్లు పంపినా కారుతో సమాధానం చెబుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తెలంగాణపై మిడతల దండులా తెలంగాణపై పడ్డారన్నారు. తమది ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించామని చెప్పారు. ఉపాధి హామీ కూలీల ప్రయోజనాలపై కాంగ్రెస్ ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. పేదలు, మధ్యతరగతి వర్గాలపై కాంగ్రెస్ పార్టీకి ప్రమలేదన్నారు. సింగరేణిని ప్రైవేటుకు అప్పగించిందే హస్తంపార్టీ అన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును ప్రియాంకా గాంధీ చదువుతున్నారని ఎద్దేవాచేశారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో తెలంగాణ ప్రస్తావన లేదన్నారు. బీజేపీని కాంగ్రెస్ నేతలు ఎందుకు ప్రశ్నించరని నిలదీశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ రెండు పార్టీల నేతలంతా ఎక్కడున్నారని నిలదీశారు. బీజేపీ హయాంలో బాగుపడ్డది కేవలం కార్పొరేట్లు మాత్రమేనని విమర్శించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు.

## రైతుబంధు ఆపిన కాంగ్రెస్ ను బొంద పెట్టండి

- మంత్రి కేటీఆర్



**టీ మీడియా, నవంబర్ 27, పెద్దపల్లి బ్యూరో :**

రైతు బంధును ఆపిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతూ%ా% ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ముందస్తు పెట్టుబడి అందించేందుకు రైతుబంధు పథకం ప్రారంభించారన్నారు. ఇప్పటికే 11 సార్లు రైతుబంధు ఇచ్చారని, కేంద్ర ఎన్నికల సంఘం సైతం రైతుబంధు నిరంతర ప్రక్రియ కాబట్టి రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు వేసుకోవచ్చని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఓటమి భయంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫిర్యాదుతో బీజేపీ ఢిల్లీలో కుట్ర చేసి కేంద్ర ఎన్నికల సంఘం నుండి తిరిగి రైతుబంధును వేయకుండా ఆదేశాలు ఇప్పించారన్నారు. అటువంటి కాంగ్రెస్, బీజేపీలకు ఈనెల 30న జరిగే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి దాసరి మనోహర్ రెడ్డిని గెలిపిస్తే డిసెంబర్ 3 తర్వాత ప్రతి మహిళకు మూడు వేల రూపాయలు అందుతాయన్నారు. 400 రూపాయలకే సిలిండర్ అందిస్తామని, తెల్ల రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరికీ సన్న బియ్యంతో పాటు ఐదు లక్షల రూపాయల బీమా అందిస్తామన్నారు. సన్యాసులకు ఓటు వేస్తే అభివృద్ధి జరగదని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మనోహర్ రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రోడ్ షోలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీ వెంకటేష్ నేత తో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో పాటు వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## పెబ్బేరు హమాలీ సంఘం బీఆర్ఎస్ లో చేరిక



**టీ మీడియా, నవంబర్ 27, పెబ్బేరు :**

పెబ్బేరు పట్టణ కేంద్రంలోని హమాలీ సంఘం నాయకులు దాదాపు 120మంది పెబ్బేరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, సింగల్ విండో చైర్మన్ గౌని కోదండరామిరెడ్డి ల సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. పెబ్బేరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి పార్టీ కండవాలు కప్పి వారిని బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి జిల్లాకు చేస్తున్న సేవలను గుర్తించి, ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు హమాలి సంఘం నాయకులు తెలిపారు. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని భారీ మెజారిటీతో వనపర్తి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలు రైతు బందు ఆపుచేయించారు

- ఏం ఎల్ సి కవిత



**టి మీడియా, నవంబర్ 27, నిజామాబాద్ :**

కాంగ్రెస్ నేతలు భాజపాను ఎందుకు ప్రశ్నించడం లేదని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఈసీ వెంటపడి మరీ రైతుబంధు ఆపివేయించారని మండిపడ్డారు. ఆ పార్టీ మరోసారి రైతు వ్యతిరేకతను చాటుకుందని.. అన్నదాత నోటికాడి ముద్దను లాగేశారని ఆమె విమర్శించారు. “ఉపాధి హామీ నిధులకు కేంద్రం భారీగా కోతలు విధించింది. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సగటున రూ.150 కూడా రావడం లేదు. వేలమంది కూలీల పొట్టగొడుతున్న భాజపా ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం కాంగ్రెస్ ఎందుకు చేయడం లేదు?పెద్దపెద్ద కార్పొరేట్లకు మాత్రమే మోదీ సాయం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారులకే రుణాలు మాఫీ చేసింది. తెలంగాణలో భారాస ప్రభుత్వం వచ్చాక ఇచ్చినన్ని ఉద్యోగాలు ఏ రాష్ట్రంలోనూ ఇవ్వలేదు. భారాస మళ్లీ గెలిస్తే కొత్త రేషన్‌కార్డులు ఇస్తాం. కులమతాల పేరుతో కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఇరిగేషన్ కావాలా.. మైగ్రేషన్ కావాలా? రైతుబంధు కావాలా? రాబందులు కావాలా?24 గంటల విద్యుత్ కావాలా? 3 గంటల కరెంట్ కావాలా? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి” అని కవిత అన్నారు.

## విద్యా వైద్యం ఉపాధికి ప్రాధాన్యత పెరగాలి

- స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి టి.దయానంద్



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణం 13 వ వార్డు రాంనగర్ లో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ కాలనీ వాసులతో కలిశారు. ఈ సందర్భంగా స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ మాట్లాడుతూ ప్రజాస్వామిక బద్ధ%శీ% గా కాలనీ వాసులు ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రలోభాలకు లొంగ వద్దు. యువత, విద్యార్థులు మహిళలు చైతన్య వ%శీ%తులు గా ఆలోచించండి.ప్రస్తుత రాష్ట్ర మిగులు బడ్జెట్ ఎంత ఉచిత పథకాలు ఎలా ఇస్తారు వాటి సమాచారం ప్రజలకు నాయకులు చెప్పవసిన భాధ్యత ఉంది. ప్రస్తుతం సమాజం లో నేడు పిల్లలు ఎక్కడ వేలుతున్నారు ఎం చేస్తున్నారు అని చూసుకునే భాద్యత ప్రతి తల్లి దండ్రుల పై ఉంది. మనం గ్రహిస్తున్నాం కల్మషం లేకుండా స్వచ్ఛమైన మనుసు కల్గిన మైనర్ పిల్లల కు కొన్ని జెండాలు, కందువలు కప్పి తిప్పుచున్నారు, ఒకసారి అలోచించి ఓటు వెయ్యాలి. విద్యా, వైద్య%శీ%, ఉపాధి కి ప్రాధాన్యత పెరగాలి. గత పాలన లో ఎం కోల్పోయాము అని తెలుసుకొని అభివృద్ధి కి పట్టం కట్టాలి, మానవ హక్కులకు, స్వేచ్ఛకు ప్రాధాన్యత పెంచే విధంగా ముందుకు నడపాలి అని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లా పట్టణలో సోమవారం సందర్భంలో తెలంగాణ రాష్ట్ర 2001 మలిదశ ఉద్యమకారుడు మండ్ల దేవన్న నాయుడు మాట్లాడుతూ రాయిగడ్డలో కాంగ్రెస్ ప్రభుత్వం తోనేబడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగి వేణు మాజీ కౌన్సిలర్ చుక్క రాజు,బోయ మురళి, వంశ మౌని మోహన్ , ఉండే కోటి శ్రీకాంత్ , రాయిగడ్డలో గడపగడప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పరిపాలనలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎంతమందికి వచ్చాయని ఎంతమంది యువతకు ఉద్యోగాలు వచ్చాయని తెలుసుకోవాలని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని ఆరు గ్యారెంటీ స్కీంలు అమలు అవుతాయని తెలిపారు. వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తూడి మెగారెడ్డి గెలుపు కోసం చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటి. ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసింహ నాయుడు, మోహన్ రాజ్ , తోకల మోహన్, కళ్యాణ్ , గణేష్ ,జక్కుల మహేష్ చాపల శీను, తైలం సందీప్, గణేష్, మహిళలు జ్యోతి,మహేశ్వరి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాయబారిని అడ్డుకున్న ఖలిస్థానీ మద్దతుదారులు

**టీ మీడియా, నవంబర్ 27, వాషింగ్టన్ :**

అమెరికాలో ఖలిస్థానీ మద్దతుదారులు భారత రాయబారి తరణ్‌జిత్ సింగ్ సంధుని అడ్డుకున్నారు. సోమవారం గురునానక్ జయంతి సందర్భంగా న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో ఉన్న హిక్స్‌విల్లే గురుద్వారాలో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తరణ్‌జిత్ సింగ్ ప్రసంగిస్తుండగా.. ఖలిస్థానీ మద్దతుదారులు అడ్డుకున్నాం

# కాంగ్రెస్, బీజేపీలో టెన్షన్.. టెన్షన్..

- రికార్డ్ బ్రేకింగ్ ఓటింగ్ దేనికి సంకేతం..?

**టీ మీడియా, నవంబర్ 27,రాజస్థాన్ :**

ఎన్నికల్లో ఫలితాలను అంచనా వేసే క్రమంలో పోలింగ్ శాతం కూడా ఒక అంశంగా మారుతుంది. గతం కంటే ఎక్కువ పోలింగ్ శాతం నమోదైందంటే.. అది ప్రభుత్వ మార్పునకు సంకేతం అని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. తక్కువ పోలింగ్ శాతం నమోదైతే ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదని, అంటే అప్పటి వరకు ఉన్న ప్రభుత్వమే కొనసాగే అవకాశం ఉంటుందని అంచనాలు వేస్తుంటారు. ఇప్పుడు రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన రికార్డ్ బ్రేకింగ్ పోలింగ్ శాతం రాజకీయ విశ్లేషకులకు పనిపెట్టింది. ఈ నెల 25న రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ జరిగింది. మొత్తం 200 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రాల్లో ఒక నియోజకవర్గం మినహా మిగతా 199 నియోజకవర్గాలకు ఓటింగ్ జరగగా.. ఈసారి పోలింగ్ శాతం 74.96 అని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అయితే తుది గణాంకాలు విడుదయ్యేసరికి మరికాస్త పెరిగే అవకాశం ఉంది. 2018లో నమోదైన 74.72 శాతం కంటే స్వల్పంగా ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. 2013లో నమోదైన 75.67 శాతంతో పోల్చితే ఈ సంఖ్య తక్కువే. మొత్తంగా ఈ ఏడాది నమోదైన పోలింగ్ శాతం తుది గణాంకాలు వచ్చేసరికి 2013 నాటి పోలింగ్ శాతాన్ని మించిపోతుందని అంచనా వేస్తున్నారు. ఏదేమైనా ఈ పోలింగ్ శాతం దేనికి సంకేతం అన్నదే ఇప్పుడు రాజకీయ విశ్లేషకుల ముందున్న ప్రశ్న.

**పోలింగ్ శాతమే కీలకం**

రాజస్థాన్‌లో గత మూడు దశాబ్దాల నుంచి అధికారం కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధ్య ప్రతి ఐదేళ్లకు మారుతూ వస్తోంది. ఎప్పుడైతే గతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదవుతుందో అప్పుడు బీజేపీ గెలిచింది. గతం కంటే తక్కువ పోలింగ్ శాతం నమోదైతే అప్పుడు కాంగ్రెస్ గెలిచింది. 1998 నుంచి ఓసారి గణాంకాలను పరిశీలిస్తే ఆ ఎన్నికల్లో 63.39 శాతం పోలింగ్ నమోదవగా.. అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 2003లో పోలింగ్ శాతం పెరిగి 67.18కు చేరుకుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. 2008కి వచ్చేసరికి పోలింగ్ శాతం కాస్త తగ్గి 66.25 నమోదైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. 2013లో ఏకంగా 75.67 శాతం ఓటింగ్ నమోదవగా బీజేపీ బంపర్ మెజారిటీతో విజయం సాధించింది.



2018లో అది స్వల్పంగా తగ్గి 74.72గా నమోదవగా.. ఈ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పూర్తి మెజారిటీ కాంగ్రెస్ సాధించలేకపోయినా.. బీఎస్పీ, స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు నమోదైన ఓటింగ్ శాతం 2018 నాటి ఓటింగ్ శాతాన్ని దాటింది. అంటే ఈ ఆనవాయితీ కొనసాగితే ఈసారి బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే ఇప్పటి వరకు కొనసాగుతూ వచ్చిన ట్రెండ్.. 3-4 శాతం ఓటింగ్ పెరిగిన ప్రతిసారీ బీజేపీ గెలవగా.. 1 శాతం పోలింగ్ తగ్గినా కాంగ్రెస్ గెలుస్తూ వచ్చింది.రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతాల్లోనూ ఏకరూపత లేదు. కొన్ని జిల్లాల్లో అత్యధికంగా 80 శాతానికి పైగా పోలింగ్ నమోదవగా.. కొన్ని జిల్లాల్లో 70 శాతం కంటే తక్కువగా నమోదైంది.

ఓటింగ్ శాతంలో మొదటి 5 స్థానాల్లో ఉన్న జిల్లాలు:జైసల్మేర్: 82.32 శాతం,ప్రతాప్‌గఢ్: 82.07 శాతం,బన్స్వారా: 81.36 శాతం,హనుమాన్‌గఢ్: 81.30 శాతం,ఝులావర్: 80.24 శాతం,ఓటింగ్‌లో దిగువన ఉన్న 5 జిల్లాలు:పాలీ: 65.12 శాతం,సిరోహి: 66.92 శాతం,రౌలి: 68.38 శాతం,జాలోర్: 69.56 శాతం,సవాయ్ మాధోపూర్: 69.91 శాతం (తుది గణాంకాలు లెక్కించకముందు)మార్వార్ జంక్షన్‌లో అత్యల్పంగా 61.10 శాతం ఓటింగ్ నమోదైంది. సీఎం అశోక్ గెహ్లాట్, మాజీ సీఎం వసుంధర రాజే పోటీ చేసిన నియోజకవర్గాల్లో కూడా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఇదిలా ఉంటే బీజేపీ తరఫున సీఎం రేసులో పేర్లు వినిపిస్తున్న రాజేంద్ర రాథోడ్, గోవింద్ సింగ్ దోటసార పోటీ చేస్తున్న స్థానాల్లో ఓటింగ్ శాతం పెరిగింది. కొన్ని గ్రామాల్లో ఒక్క ఓటు కూడా నమోదు కాలేదు. బరాన్‌లోని దేవ్‌పురియా, కలుఖేడా గ్రామాల్లో తమకు కనీస వసతులైన రోడ్లు, కరెంటు, మంచినీరు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించారు. అధికారులు ఎంతగా నచ్చజెప్పే ప్రయత్నం చేసినా సరే ఒక్క ఓటర్ కూడా ముందుకు రాలేదు.సీఎం వర్సెస్ పీఎంరాజస్థాన్‌లో ఈసారి ఎన్నికల్లో ఓ ప్రత్యేక పరిస్థితిని ఏర్పడింది. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి పోటీపడడం సాధారణంగా జరిగేదే. గత కొన్ని దశాబ్దాలుగా అశోక్ గెహ్లాట్, వసుంధర రాజే మధ్య ఇదే జరుగుతూ వచ్చింది. కానీ ఈసారి బీజేపీ జాతీయ నాయకత్వం మాజీ సీఎం వసుంధర రాజేను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎక్కడా ప్రకటించలేదు. పైపెచ్చు ఆమె పేరును ముందే ప్రకటిస్తే ఆమెపై ఉన్న వ్యతిరేకత తమకు చేటు చేస్తుందని కూడా భయపడింది. అదే సమయంలో సీఎం రేసులో ఇంకా చాలామంది నేతలు ఉన్నారన్న సంకేతాలు కూడా ఇచ్చింది. ఇక ప్రచారపర్వంలో అశోక్ గెహ్లాట్‌ను ఢీకొట్టే బాధ్యతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భుజానికెత్తుకున్నారు. దీంతో ఎన్నికల ప్రచారం కాస్తా సీఎం వర్సెస్ మాజీ సీఎం అవ్వాల్సిన చోట సీఎం వర్సెస్ పీఎంగా మారింది.హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఓటర్లు రాష్ట్రం, కేంద్రం విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శిస్తూ వస్తున్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి వరకు బీజేపీ అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఓటమిపాలైంది. కానీ కొద్ది నెలల వ్యవధిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ రాష్ట్రాలను బీజేపీ దాదాపు క్లీన్ స్వీప్ చేసింది. అంటే ఓటర్లు స్థానికంగా తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని కోరుకుంటూనే.. జాతీయస్థాయిలో మోదీ నాయకత్వానికి జై కొడుతున్నారు. ఎన్నికల తుది ఫలితాలు వెల్లడయ్యేందుకు మరో వారం రోజుల సమయం ఉన్నప్పటికీ.. ఈలోగా పోలింగ్ శాతాన్ని బేరీజు వేసుకుంటూ రాజకీయ విశ్లేషణలు జరుగుతున్నాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చే ఆనవాయితీని మార్చి మరోసారి అధికారం చేజిక్కించుకోవడం కోసం కాంగ్రెస్ 7 హామీలతో పాటు ప్రజాకర్షక మేనిఫెస్టోను నమ్ముకోగా.. మార్పు ఆనవాయితీ, పెరిగిన ఓటింగ్ శాతం తమకు కలిసొస్తాయని బీజేపీ భావిస్తోంది.

## హలాల్ ముద్రిత వస్తువులను తొలగించండి

- యోగి ప్రభుత్వం అల్టిమేటం



**టీ మీడియా, నవంబర్ 27, లక్నో :**

హలాల్ ముద్రిత ఆహార పదార్థాలను తమ స్టోర్స్ నుండి 15 రోజుల్లోగా తొలగించాలని యుపి ప్రభుత్వం సోమవారం అల్టిమేటం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్ట్స్, రిటైలర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ నుండి వాటిని తొలగించాలని ఆదేశించింది. అలాగే ధ్రువీకరణ లేని సంస్థల నుండి హలాల్ ధ్రువీకరణ పొందుతున్న 92 ప్రభుత్వ ఉత్పత్తి సంస్థలకు తమ ఉత్పతులను యుపిలో వెనక్కు తీసుకోవాలని లేదా తిరిగి ప్యాకేజ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. హలాల్ ముద్రిత ఆహార పదార్థాల ఉత్పత్తి, నిల్వ, పంపిణీ, అమ్మకంపై ఈ నెల 18న యోగి ప్రభుత్వం ఏకపక్షంగా నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో వివిధ జిల్లాల్లోని 500 సంస్థలు మరియు రాష్ట్రంలోని 97 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించడంతో పాటు ఇప్పటివరకు సుమారు 2,500 కిలోల హలాల్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంది. అంతేకాకుండా నాలుగు సంస్థలపై హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు కూడా నమోదైంది. ఈ కేసును ప్రభుత్వం స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్)కి బదిలీ చేసింది. కొన్ని కంపెనీలు లాభాల కోసం, నిర్దిష్ట కమ్యూనిటీలో అమ్మకాలను పెంచేందుకు కొన్నింటిపై హలాల్ ఉత్పత్తులుగా ముద్రిస్తున్నాయని భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం) ఆఫీస్ బేరర్ ఫిర్యాదు చేసింది. ఇది అతి పెద్ద ఫోర్జరీ, మోసం అని ఆరోపించింది. బిజెవైఎం ఫిర్యాదుతో ఐపిసిలోని 120బి (నేరపూరిత కుట్ర), 384 (దోపిడీ), 420 (మోసం), 467 (ఫోర్జరీ), 468 (మోసం చేసే ఉద్దేశంతో ఫోర్జరీకి పాల్పడటం), 471 (నకిలీ పత్రాన్ని నిజమైనదిగా చూపడం), 153ఎ (రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం) మరియు 298 (ఉద్దేశపూర్వకంగా మత విశ్వాసాలను గాయపరచడం ) సెక్షన్స్ కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

## మీ ఆశీస్సులే నా బలం



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నర్సింగాయి పల్లి, నాగవరం కాలనిలో ఎన్నికల ప్రచారం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పనుల కాలంలో కూడా ఇంత మంది రావడం చాలా అనందంగా ఉన్నది.2018 లో మొదటి సారి ఎమ్మెల్యే అయ్యి మంత్రిని అయ్యాను. ఒక్కసారి ఎమ్మెల్యే అయితేనే 12 సార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికంటే ఎక్కువగా చేశాను. నర్సింగాయి పల్లి వనపర్తి కి బంగారు తునక. పాత పట్టణం అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో మాత శిశు సంరక్షణ కేంద్రం, పీజీ కళాశాల ఇక్కడ ఏర్పాటు చేశా.. త్వరలో ఆర్టివో కార్యాలయం సైతం ఇక్కడ ఏర్పాటు కానున్నది.వనపర్తి జిల్లా కేంద్రం కావడంతో ప్రైవేటు సంస్థలు అనేకం ఇక్కడకు వచ్చాయి దీనివల్ల చాలా మందికి అనేక పనులు దొరుకుతున్నాయి.

కారు గెలిస్తే నియోజకవర్గం ప్రజలందరూ గెలుస్తారు. 2 వేల పింఛన్ 5 వేలు అవుతుంది, పింఛన్ లేని అర్హులైన మహిళలు సౌభాగ్య లక్ష్మి, గృహలక్ష్మి పథకం కింద అందరికి అమలు చేయడం జరుగుతుంది .గ్యాస్ సిలిండర్ పెరుగుతూనే ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ భరించి రూ 400 లకే ఇవ్వడం జరుగుతుంది. భూమి ఉన్న వాళ్లకు రైతుభీమా ఇస్తున్నారు భూమి లేని వారి పరిస్థితి ఏంటిదని ప్రజల నుండి వినతులు రాగా ప్రభుత్వం అలోచించి భూమి లేని నిరుపేదలకు రైతు బంధు తరహాలో కెసిఆర్ భీమా ను అమలు చేయనున్నాం. పని ఏది ఉన్న 24 గంటలు ఎప్పుడైనా రావచ్చు పని చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

తెచ్చుకున్న తెలంగాణ లో అన్ని రకాల వసతులు కల్పించుకున్నాం కాంగ్రెస్ వాళ్లు వచ్చి ఎం చేస్తారు.

3250 డబుల్ బెడ్ రూ ఇండ్లు పూర్తి చేసి నిరుపేదలకు అందించాను. సూరాయపల్లి 474 మంది రైతులకు 11 విడతలో 5 కోట్ల 75 లక్షలు రైతుబంధు వచ్చాయి. తెలంగాణ రాక ముందు ఉన్న పరిస్థితి ని చూస్తే ప్రస్తుతం సాగునీళ్లు, మంచి నీటి వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించడంతో అప్పటికి ఇప్పటికి చాలా మెరుగు అయింది. ఇంకా మెరుగు కావాలన్నదే ప్రభుత్వం లక్ష్యం భవిష్యత్తు లో జరిగి మే కండ్ల ముందు కనిపిస్తుంది. ప్రభుత్వం వల్ల ఏమి సాధ్యం అవుతుందో అదే చెబుతాం. సోమవారం నుండి రైతు బంధు రావాల్సి ఉన్నది, కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిటీ కి పిర్యాదు చేసి రైతు బంధు ఆపివేయడం జరిగింది. రైతు బంధు వస్తే రైతులు బాగుపడుతారని అక్కసు తో రైతు బంధును రాకుండా చేసారు.

**మంత్రి సమక్షంలో పార్టీ చేరికలు:**

ఖిల్లా ఘనపురం మండల కేంద్రానికి చెందిన రాంరెడ్డి తో పాటు 10 మంది వివిధ పార్టీల నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారి సమక్షంలో పార్టీలో చేరారు. దీక్ష లో ఉండి కూడా పార్టీలో చేరడం అయ్యప్ప స్వామి ఆశీర్వాదాం వచ్చిందని భావిస్తున్నాన్ని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు.

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించాలి

- ఎస్పీ రక్షిత కె మూర్తి



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి జిల్లాలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్ నందు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ అధికారులతో వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి బ్రీఫింగ్ సెషన్ సమావేశాన్ని నిర్వహించారు. నవంబర్ 30 వ తేదీ న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో బలగాలు వనపర్తి జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా, ఓటర్ల కు భయాందోళనలకు అవకాశం లేకుండా తమ ఓటు హక్కు ను స్వేచ్ఛ గా వేయడం లో భరోసా కల్పించడం లో భాగంగా ఫ్లాగా మార్చ్, రూట్ మార్చ్ లు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత బందోబస్తు విధులు నిర్వర్తించాలని, ఎన్నికల రోజు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో స్టాటిక్ బందోబస్త్, మిగతా ఫోర్స్ రూట్ బందోబస్త్ మరియు అత్యవసర పరిస్థితి సమయంలో విధులు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఎస్ ఎస్ టి టీమ్స్ డ్యూటీ లు, నకాబంది విధుల గురించి వారికి వివరించారు మరియు కీలకమైన పాయింట్‌ల వద్ద యూపీఎస్పీఏపీ ఫోర్స్ సిబ్బందిని ఉంచడం జరుగుతుంది అన్నారు.7 కంపెనీలు ఒక్క ఒక్క కంపెనీ లో 100 మంది సిబ్బంది ఉంటారు మొత్తం 700 మంది యూపీఎస్పీఏపీ ఉండడానికి సరైన వసతి ఏర్పాట్లు చేయాలని, వారితో కలిసి పనిచేయాలని వనపర్తి అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజ వత్ కి ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి అని సూచించారు. అదేవిధంగా వనపర్తి డి.ఎస్.పి ఆనంద రెడ్డిని వనపర్తి సీఐ మహేశ్వర్ ని కొత్తకోట సిఐ శ్రీనివాస్ రెడ్డిని ఆత్మకూరు సిఐ శ్రీ రత్నం ని రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ అప్పలనాయుడు ని యూపీఎస్పీఏపీ అధికారులకు పరిచయం చేశారు.ఈ సమావేశం లో వనపర్తి అడిషనల్ ఎస్పీ శ్రీరామదాసు తేజావత్, వనపర్తి డిఎస్పి ఆనంద రెడ్డి, డిప్యూటీ సూపరిడెంట్ ఆఫ్ పోలీస్, పర్వేజ్ ఆలం, డీఎస్పీ దినేష్ యాదవ్, సీఐ లు వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పూర్తి సినిమా చూపిస్తారు

- ప్రధాని మోదీ



**టీ మీడియా, నవంబర్ 27, కరీంనగర్:**

మరో 24 గంటల్లో తెలంగాణ ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అగ్రస్థాయి నేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్‌లో బీజేపీ సకలజనుల విజయ సంకల్ప సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. “ ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆట ముగియనుంది. మొదటిసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాబోతోంది. తెలంగాణ బీజేపీ తొలి సీఎం బీసీయే అవుతారు. చరిత్రలో 16 మహాజనపదాల్లో అస్మక జనపదం ఈ ప్రాంతం. హుజూరాబాద్ ఉపఎన్నికతో కేసీఆర్‌కు ట్రైలర్ చూపించాం. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు పూర్తి సినిమా చూపిస్తారు” అని ప్రధాని మోదీ అన్నారు. పీవీ నరసింహారావుని కాంగ్రెస్ పార్టీ ప్రతి అడుగులో అవమానించిందని హస్తం పార్టీపై ఆయన విరుచుకుపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కార్లు అవసరం లేదని మోదీ అన్నారు. గ్యారెంటీలను నెరవేర్చే మోదీ సర్కార్ తెలంగాణకు అవసరమని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఉచిత వైద్యం అందిస్తామని అన్నారు. మోదీ గ్యారెంటీ అంటే అందరికీ ఆరోగ్యం, మోదీ గ్యారెంటీ అంటే రైతులకు చేయూత అని అన్నారు. ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రాధాన్యతని, ఓ వైపు కేసీఆర్ ఉన్నారు. మరో వైపు మీ సేవకుడు మోదీ ఉన్నాడని ప్రధాని అన్నారు

## ఎంఐఎం కార్యకర్తలు శ్రమించి చందర్ ను గెలిపించాలి



**టీ మీడియా, నవంబర్ 27, గోదావరిఖని :**

రామగుండం నియోజకవర్గం ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు డివిజన్ లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్రియాశీలక కార్యకర్తలు, ఎంఐఎం పార్టీ అభిమానులు కలసికట్టుగా పదునైన మెట్టుగా శ్రమించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని రామగుండం నియోజకవర్గ ఎంఐఎం పార్టీ నగర సీనియర్ నాయకుడు మీరు జాకీర్ అలీ, జాయింట్ సెక్రటరీ సయ్యద్ ఖాదర్ అలీ. ఎంఐఎం పార్టీ క్యాడర్క్ దిశా నిర్దేశం చేశారు. సోమవారం జాకీర్ అలీ నివాసంలో నగర కమిటీ సభ్యులు, డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లు, క్రియాశీలక కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సీనియర్ నాయకుడు మీరు జాకీర్ అలీ మాట్లాడారు. పోలింగ్ రోజున ఓటింగ్ పర్సంటేజ్ పెరిగేలా ప్రతి ఒక్కరూ కంకర బద్దలై కృషి చేయాలని కోరుకంటి చందర్ కారు గుర్తుపై ఓటేసి గెలిపించేలా బాధ్యతగా ఎంఐఎం పార్టీ క్యాడర్ పనిచేయాలని, ఇది తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశం ఉందని వారికి చెప్పారు. రామగుండం నియోజకవర్గంలో హిందూ, ముస్లిం, సిక్, క్రిస్టియన్ ఇలా అన్ని వర్గాల మద్దతు కోరుకంటి చందర్ వైపే ఉందని, రెండవసారి కోరుకంటి చందర్ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, మూడవసారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయంగా ఉందని పేర్కొన్నారు. గెలుపు ఊరికే జరగదని దానికోసం కచ్చితంగా ఎంఐఎం పార్టీ 35 డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కష్టపడి పని చేయాలని అనంతరం ప్రతిఫలం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు మహమ్మద్ తాజుద్దీన్, ఖాజా మొయినుద్దీన్, మెహబూబా, ఆయేషా, ఖాతూన్, కనక లక్ష్మి, మహమ్మద్, అఫ్జల్, చాంద్ పాషా, మిర్జా అహ్మద్, హమీద్, యాకుబ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 30న మరకత లింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

- ఆలయ నిర్వాహకులు కే. మస్తాన్ రావు



**టీ మీడియా, నవంబర్ 27, మహానంది:**

మహానంది మండలం గాజులపల్లి అర్.ఎస్. గ్రామంలోని గంగా గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామికి కార్తీక మాసం బుధవారం రోజున ప్రదోషకాల సమయంలో ఆరుద్ర నక్షత్రము నందున ఘనంగా అన్నాభిషేకం నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు కే .మస్తాన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువ శాతం నవగ్రహ దేవాలయములను, మరకత లింగేశ్వర స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు అన్నారు. ఈ క్షేత్రం నందు నవగ్రహ ఆలయ సముదాయం నందు బుధవారం నాడు మరకత లింగేశ్వర స్వామికి జరగబోయే అన్నాభిషేకం కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## 144 సెక్షన్ అమలు



**గోదావరిఖని :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు -2023 సందర్భంగా నవంబర్ 30న ఎన్నికలు ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు తేదీ నవంబర్ 28వ సాయంత్రం 5 గంటల తరువాత నుంచి, డిసెంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్ (డిఐజి) ఉత్తర్వులు జారీ చేశారు.రామగుండం పోలీస్ కమీషనరరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువమంది గుంపులు గుంపులుగా తిరగొద్దని తెలిపారు. రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై, మరియు ఎన్నికల సంఘం యొక్క నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

## ఓటు వేసేముందు ఒక్కసారి ఆలోచించండి

- కౌన్సిలర్ బి.ఎల్లారెడ్డి



**టీ మీడియా, నవంబర్ 27, పెబ్బేరు:**
పెబ్బేరు మండల కేంద్రంలోని ఎనిమిదవ వార్డు లో కేసీఆర్ మేనిఫెస్టో ఇంటింటి ప్రచారం జోరుగా కొనసాగింది. 8వ వార్డు కౌన్సిలర్ బి.ఎల్లారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎండి. ముస్తాక్ వార్డు పరిధిలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను పరుల చేతిలోకి పోకుండా జరిగిన అభివృద్ధిని చూసి ఒకసారి ఆలోచించి ఓటు వేయాలని వార్డు ప్రజలను కోరారు. వనపర్తి జిల్లాగా రూపాంతరం చెందడానికి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎంతగానో కృషి చేశారని, వనపర్తికి కార్యాలయ సముదాయం బిల్డింగులు ఏర్పాటు చేసి పాలన సులభతరం చేశారని, వనపర్తి జిల్లాగా ఏర్పడిన తర్వాత ఎన్నో మండలాలు ఏర్పడ్డాయని ప్రజల సౌకర్యార్థం మెరుగైన పాలనను అందించేందుకు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎంతగానో కృషి చేశారని అన్నారు. వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మరింత అభివృద్ధి చెందాలంటే సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని వనపర్తి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని వార్డు ప్రజలను కోరారు. కారు గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో వనపర్తి ఎమ్మెల్యేగ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని గెలిపించుకోవాలని వార్డులోని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎండి.ఖాజా, వై గోపి, వై.శేఖర్, చింతలయ్య, మైబు, మహేష్, సత్యనారాయణ, దేవేందర్, ఖదీర్, సిద్ధు, ఓంకార్, మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించండి



**టీ మీడియా, నవంబర్ 27, పెబ్బేరు:**
పెబ్బేర్ పట్టణ కేంద్రంలోని ఎనిమిదవ వార్డులో కాంగ్రెస్ నాయకులు పి.శివసాయి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కలలుగన్న తెలంగాణ సాకారానికి కాంగ్రెస్ అధిష్టానం బలపరిచిన వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తూడి మేఘారెడ్డిని అధిక మెజారిటీ తో వనపర్తి ఎమ్మెల్యే గా గెలిపించాలని, హస్తం గుర్తుపై ఓటు వేయాలని వార్డు ప్రజలను కోరారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తారని తెలిపారు. దీంతో ఎంతోమంది పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తూడి మేఘారెడ్డిని వనపర్తి ఎమ్మెల్యేగా అధిక మెజారిటీతో గెలిపించుకుందామని వార్డు ప్రజలను కోరారు.

## కాంగ్రెస్ పార్టీ భారీ రోడ్ షో ప్రచారం



**టీ మీడియా, నవంబర్ 27, లక్షెట్టిపేట :**
లక్షెట్టిపేట పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్ సాగర్ రావు సోమవారం రోజున భారీ రోడ్డు చేస్తూ ప్రచారం చేసారు.ఈ సందర్భంగా ఆదివాసీలు సాంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలకగా,మహిళలు జయధ్వానాలు చేశారు. అనంతరం ప్రేమ్ సాగర్ రావు ఉత్కూర్ చౌరస్తా లో మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో మంచిర్యాల అభివృద్ధికి బీఆరెస్ ఎమ్మెల్యే దివాకర్ రావు చేసిందేమి లేదని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రేమ్ సాగర్ రావు విమర్శించారు.గత నాలుగు సార్లు మంచిర్యాల ఎమ్మెల్యేగా గెలిచిన దివాకర్ రావు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ,ఆస్తులు పెంచుకున్నాడని,అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో కమిషన్లు రాజ్యమేలుతున్నాయని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో ప్రజల జీవితాలను మారుస్తామని, అవినీతికి తావు లేకుండా సూపరిపాలన అందిస్తామన్నారు.ఎక్కడికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని, ఈసారి కాంగ్రెస్ కు అఖండ విజయం ఖాయమని ఆయన అన్నారు. లక్షేట్టిపేట ప్రజలు బ్రమ్మ రథం పట్టినారు.ఈ కార్యక్రమంలో గడ్డం త్రిమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్,చెల్లా నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్,మండల అధ్యక్షుడు పింగళి రమేష్, ఎంపీపీ అన్నం చిన్నాన్న మంగ, వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి,కౌన్సిలర్ రాందేని వెంకటేష్,యూత్ అధ్యక్షుడు రాందేని చిన్న వెంకటేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేల రాజు, మాజీ సర్పంచ్ రాయలింగు, అమీర్,రాజు, హాజీ కార్యకర్తలు వార్డ్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## విలేకర్ల పై రాళ్ళతో దాడి..

- నర్సిహ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డిలపై కేసు నమోదు



**టీ మీడియా, నవంబర్ 27, జవహర్ నగర్ :**
జర్నలిస్ట్ లపై రాళ్ళతో దాడిచేసి చంపుతానని బెదిరిస్తూ వీరంగం సృష్టించిన కరుడుగట్టిన మట్టిమాఫియా బ్రదర్స్ నర్సిహ్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించనున్నట్లు తెలిపిన జవహర్ నగర్ పోలీసులు. జవహర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారామ్ వివరాల ప్రకారం విధినిర్వహణలో భాగంగా లక్ష్మీనర్సిహ్మ కాలనీలో సర్వే నంబర్ 691లోని గుట్టను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఫోటోలు తీసినందుకు, నర్సిహ్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి లు విలేకరులను అడ్డగించి అందరూ చూస్తుండగా నానా బూతులు తిడుతూ చేయి చేసుకోవడమే కాక వాళ్లపై రాళ్ళతో దాడిచేసి, ఇక్కడికి విలేకరులు ఎవ్వరు రావొద్దని ఒకవేళ వస్తే వేణును చంపినట్టు చంపుతానని బెదిరిస్తూ చేతిలోని సెల్ ఫోన్లను బలవంతంగా లాక్కొని ఫొటోలను డిలీట్ చేసి అనుచరులతో కలిసి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఈ సంఘటనపై బాధితుడు శంకరాచారి ఇచ్చిన పిర్యాధుమేరకు విచారణ జరిపి సెక్షన్ 341, 324, 506, 34 ఐపీసి కింద కేసునమోదు చేసామని తెలిపారు. వీరిపై గతంలో ఉన్న నేరచరిత్రను పరిశీలిస్తున్నామని దాదాగిరి గుండాగిరి చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన

- జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
చిట్యాల లోని ఏ.ఎం.సి. వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఎన్నికల ఏర్పాట్లను వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్వయంగా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ప్రసంగిస్తూ పోలింగ్ రోజు సెక్టోరియల్ అధికారులకు. ప్రొసీడింగ్ అధికారులకు. సహాయక ప్రొసీడింగ్ అధికారులకు రిసెప్షన్. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో కావలసిన ఏర్పాట్లను చేయాలని అన్నారు. సెంటర్లో భారీకెట్లు ఏర్పాటు విద్యుత్, వాహనాల పార్కింగ్, వాహనాల రవాణా సజావుగా జరగాలని అన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భోజన సదుపాయం ఏర్పాట్లు చేయాలన్నారు. సిబ్బందికి కావలసిన మౌలిక సదుపాయాలు ఉండేలా అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్,వనపర్తి రిటర్నింగ్ అధికారి ఎస్ తిరుపతి రావు, వనపర్తి ఆర్డిఓ పద్మావతి, వనపర్తి స్థానిక తహసిల్దార్ యాదగిరి,వనపర్తి రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధుసూదన్, వనపర్తి జిల్లా కలెక్టర్ సిసి తిలక్ రెడ్డి, రిటర్నింగ్ అధికారి సీసీ రహీం,నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక వజ్రాయుధం



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధం లాంటిదని దానిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ బొల్లి ఆదామ్ రాజ్ అన్నారు. వనపర్తి పట్టణంలో యువతను వ్యాపారం చేసుకుంటున్నా వారిని ప్రజానీకాని కలిసి మానవ హక్కుల వేదిక ఓటు హక్కు వినియోగం పై ముద్రించిన కరపత్రాలను ఇస్తూ వారితో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఒక మంచి నాయకుని ఎన్నుకునేందుకు ఓటు హక్కు కీలకమన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ఆయుధం అని దాని దుర్వినియోగం కాకుండా 100కు 100% ఓటును వినియోగించుకోవాలని ఆయన కోరారు. మనల్ని పాలించే సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వార్థపరులను నమ్మకుండా స్వచ్ఛందంగా తమ ఓటును వినియోగించుకోవాలని
బొల్లి ఆదామ్ రాజ్ హ్యూమన్ రైట్స్ ఫోరం , ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ కోరారు.

## బీఆర్ఎస్ సభ్యురాలు సహా కాంగ్రెస్‌లోకి

- ప్రసాద్ రెడ్డి, రాయల సమక్షంలో చేరికలు



**టీ మీడియా, నవంబర్ 27,తిరుమలాయపాలెం:**
మండలంలోని దమ్మాయి గూడెంలో బీఆర్ ఎస్ కు చెందిన 30 కుటుంబాల వారు ఉన్నం రాజశేఖర్, వేముల ఉపేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. వీరికి కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావు తో కలిసి ఆపార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సోమవారం ఖమ్మం రూరల్ సాయి గణేష్ నగర్ లోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. హస్తం గూటికి చేరిన వారిలో వార్డు సభ్యురాలు రమిజానీ, కేసీఆర్ సేవాదళ్ మైనారిటీ సంఘం జిల్లా అధ్యక్షుడు షకీల్ పాషా, వీరెల్లి ఉపేందర్, లాల్ బీ, శాబీరా బీ, తాజుద్దీన్, నాగుల్ మీరా, కస్తూరమ్మ, ఉన్నం సత్యనారాయణ తదితరులు ఉ న్నారు. ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆవేదన..:లి కాంగ్రెస్ లో చేరిన వారు మాట్లాడుతూ.. ప్రజలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పొంగులేటి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..:లి రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ శీనన్న అందరికీ అండగా వుంటారని అభయం ఇచ్చారు. భారీ మెజారిటీ తో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ రాజ్యం కావాలా.? రాబందుల రాజ్యం కావాలా.?

- బీఆర్ఎస్ అభ్యర్థికి కోట్ల ఆస్తులు ఎక్కడివి
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
ఇందిరమ్మ రాజ్యం కావాలా ? రాబందుల రాజ్యం కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తిలో ఆయన రోడ్ షో నిర్వహించి రాజీ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. వనపర్తి నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి లక్షల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని ఇది ప్రజల నుండి తీసుకున్న డబ్బు కాదా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ అడుగులకు మడుగులొత్తే నేతలను రాబందులుగా తయారుచేసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన అన్నారు. సంపన్న రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి తమ కడుపులో నింపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని ఈసారి ఎన్నికల్లో గెలిపించి సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. నిజాయితీ పరుడైన మేఘారెడ్డిని గెలిపిస్తే ఏ ఒక్క తప్పు చేయడని, మచ్చలేని నాయకుడు మేఘారెడ్డి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియామకాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నియామకాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్కు ఓటేసి రాబందుల నుండి రాష్ట్రాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ జి చిన్నారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ చేయలేని ఈ ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయిందని, ఇక్కడ మంత్రిగా ఉన్న నిరంజన్ రెడ్డి నిరుద్యోగులు హమాలీ పని చేసుకోవాలని, అంతకంటే ఉపాధి ఏముంటుందని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మెగా రెడ్డి మాట్లాడుతూ తనకు ఓట్లు వేసి గెలిపిస్తే నిజాయితీగా పాలన సాగిస్తానని, చిన్నారెడ్డి సూచనలు సలహాల మేరకు నడుచుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. 30వ తేదీన జరగబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. భూములు, చెరువులు, నదులను ఆక్రమించుకోరని ఆయన అన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని, మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇల్లు లేని పేదలకు ఇస్తామని, కొత్త రేషన్ కార్డులు కొత్త పెన్షన్లను ఇవ్వడంతో పాటు వాటిని పెంచుతామని చెప్పారు. అవినీతి పాలన అంతమొందించేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు.

## పేదల తరపున మాట్లాడితే ఈటలను గెంటేశారు

- కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా



**టీ మీడియా, నవంబర్ 27, హుజూరాబాద్ :**
తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం హుజూరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఓ కుటుంబం నుంచి సీఎం అవుతారని అన్నారు. అదే బీజేపీకి ఓటు వేస్తే బీసీ సీఎం అవుతారని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని అమిత్ షా కోరారు. పేదల తరుపున మాట్లాడినందుకే సీఎం కేసీఆర్ ఈటలపై కక్ష్య పెంచుకున్నారని విమర్శించారు. అందుకే పార్టీ నుంచి బయటకు పంపించారని అన్నారు. రాష్ట్రంలో మార్పు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం..బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఒప్పందం జరిగిందని అమిత్ షా ఆరోపించారు. మళ్లీ తెలంగాణలో కేసీఆర్‌నే సీఎం చేయాలని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ చూస్తున్నారని అన్నారు. అలాగే రాహుల్ గాంధీని పీఎంగా చూడాలని కేసీఆర్ అనుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటే అని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్లు తీసి వేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం రూ.60 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. వరి ధాన్యానికి రూ.3100 మద్దతు ధర ఇస్తామని చెప్పారు. మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు.

## రైతుల పెట్టుబడికి రెండింతల ఆదాయం పెరగాలి

- బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞ రెడ్డి భూజల



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
వనపర్తి అసెంబ్లీ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞ రెడ్డి వనపర్తి మండలం చిట్యాల తూర్పు తండా అచ్చుతాపురం వనపర్తి పట్టణంలో కేడిఆర్ నగర్, బసవన్న గడ్డ, వివేకానంద చౌరస్తా, ఇందిరాపార్క్ మార్గంలో ఇంటింటి ప్రచారం వ్యాపార సముదాయాలలో ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలు పట్టణంలోని ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే తలమానికమని దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రైతాంగం చేరుకుందని గొప్పలు చెప్పే కేసిఆర్ ఆచరణలో మాత్రం రైతాంగానికి వెన్నుపోటు పొడిచారని ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేస్తానని వాగ్దానం చేసి నాలుగున్నర సంవత్సరాలైనా రుణమాఫీ చేయలేదని రైతులు మాత్రం తీసుకున్న రుణానికి వడ్డీల మీద వడ్డీలు పెరిగి రైతులంటేనే బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే అవకాశం లేకుండా చేశాడని, రైతుబంధు పేరిట రైతాంగానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశాడని తెలంగాణలో వ్యవసాయం లాభ దాయకంగా ఉంటే రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో కెసిఆర్ స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారాధ్యంలో రాబోయే తెలంగాణ బిజెపి ప్రభుత్వంలో రైతుల పెట్టుబడికి రెండింతలు ఆదాయం చేసే విధంగా రైతాంగానికి ఎరువుల మీద లక్షల కోట్ల సబ్సిడీ, 14 రకాల వ్యవసాయ పంటలకు మద్దతు ధర పెంచి పెంచాడని నవంబర్ 3న ఏర్పడబోయే తెలంగాణ బిజెపి ప్రభుత్వంలో క్వింటాల్ వరి ధాన్యానికి వెయ్యి రూపాయలు పెంచి సాలిన ఎకరానికి రెండు పంటలకు 30 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తే ఎకరానికి 60 వేల ఆదాయం వస్తుందని ఇది కెసిఆర్ ఎకరాకిచ్చే రైతుబంధు కంటే ఆరు రెట్లు అధికమని రైతాంగ సోదరులంతా బిజెపి పార్టీకి మద్దతు ఇచ్చి కమలం పువ్వు గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

## ప్రజలు ధైర్యంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ రక్షిత కె. మూర్తి



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తామ ఓటు హక్కు వినియోగించుకునెలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా పోలీసులు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర. అర్మడ్ బలగాలచే ఫ్లగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది అని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి తెలిపారు.పెబ్బేరు టౌన్ లో సోమవారం రాత్రి జిల్లా పోలీసులు, ఉత్తర ప్రదేశ్ ఆర్మడ్ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ ను పోలీస్ స్టేషన్, నుండి ప్రారంభమై శు బాష్ చౌక్, సంత బజార్ రోడ్ మీదుగా కొల్లాపూర్ చౌరస్తా వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా జిల్లా పోలీసులు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర. అర్మాడ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలందరికీ ఎన్నికల పట్ల భద్రత, బరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోని ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ తెలిపారు. జిల్లాలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్పోస్టుల దగ్గర, జిల్లా పరిధిలో ఆకస్మికంగా పకడ్బందీగా నాఖబంది, వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర. ఆర్మాడ్ బలగాల కమాండెంట్ కొత్తకోట సిఐ శ్రీ శ్రీనవాస రెడ్డి, పెబ్బేరు ఎస్సైశేఖర్ రెడ్డి పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆర్మాడ్ బలగాలు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కలెక్టర్ , కమీషనర్



**టీ మీడియా, నవంబర్ 27,ఖమ్మం:**
ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్ తో కలిసి, జిల్లా ఎన్నికల అధికారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30న జరిగే పోలింగ్ కు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 97.5 శాతం ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేసినట్లు, 27 వేల ఓటర్ సమాచార స్లిప్పులు సంబంధిత ఓటర్లు అందుబాటులో లేక పంపిణీ కాలేదని, అట్టి వానిని రిటర్నింగ్ అధికారులకు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. ఓటర్ సమాచార స్లిప్పు కేవలం సమాచారం కొరకు మాత్రమే నని, ఓటు వివరాలు ఆన్లైన్ లో, సంబంధిత బిఎల్ఓ ద్వారా తెలుసుకోవచని, లేకున్న ఓటు వేయవచ్చని, గుర్తింపు కార్డులు వెంట తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చని ఆయన అన్నారు. జిల్లాలో 235315 క్రొత్త ఎపిక్ కార్డులు సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు, ఓటరు నమోదు చివరి రెండు రోజుల్లో దరఖాస్తు చేసిన 9900 మందికి ఏపిక్ కార్డులు సోమవారం అందినట్లు, వీటిని త్వరగా బట్వాడా కొరకు ఎన్నికల సంఘం బిఎల్ఓ ల ద్వారా చేయాలని అనుమతి ఇచ్చిందని, మంగళవారం లోగా రాజకీయ పార్టీల వారికి సమాచారం ఇచ్చి, పంపిణీ పూర్తిచేస్తామన్నారు. రాజకీయ పార్టీలు తమ పోలింగ్ ఏజెంట్ల జాబితా ఇవ్వాలన్నారు. పోలింగ్ ముగియు 48 గంటల ముందు, మంగళవారం సాయంత్రం నాటికి ఇతర జిల్లాలకు చెందిన వారు వెళ్లిపోవాలన్నారు. పోస్టల్ ఓటింగ్ చేపట్టి, ఎన్నికల విధుల సిబ్బందికి ఓటుహక్కు వినియోగానికి చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. ఫిర్యాదులు ఉంటే సి విజిల్ యాప్ ద్వారా చేయాలన్నారు.
సమావేశంలో పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, డ్రై డే సందర్భంగా మంగళవారం సాయంత్రం అన్ని వైన్ షాపులు మూసివేస్తారన్నారు. బయటి వ్యక్తులు జిల్లాలో ఉండడానికి వీలులేదన్నారు. 29 లోగా వాహనాల పాసులు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు,బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి జి. కృష్ణ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సత్యం బాబు, బిజెపి పార్టీ ప్రతినిధి జి. విద్యాసాగర్, టిడిపి పార్టీ ప్రతినిధి కె. కరుణాకర్, కృష్ణ ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి తిరుమల రావు, సిపిఎం పార్టీ ప్రతినిధి నున్నా నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుబంధు పంపిణీకి అనుమతి ఇవ్వండి

- ఈసీకి బీఆర్ఎస్ విజ్ఞప్తి




**టీ మీడియా, నవంబర్ 27, హైదరాబాద్ :**
రైతుబంధు పంపిణీకి అనుమతి అనుమతిని నిరాకరిస్తూ తాజాగా తీసుకున్న నిర్ణయాన్ని పున్ణపరిశీలించాలని ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ మరోసారి విజ్ఞప్తి చేసింది. తొలుత రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతి ఇచ్చింది. అయితే బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యల నేపథ్యంలో రైతుబంధు పంపిణీకి ఇచ్చిన అనుమతిని ఎన్నికల సంఘం వెనక్కి తీసుకుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మరోసారి ఈసీని ఆశ్రయించింది.ఈ నెల 28వ తేదీలోపు రైతుబంధు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఈసీ అనుమతి ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రైతుబంధు గురించి ప్రస్తావించరాదని ఈసీ షరతులు విధించింది. ఈ పథకం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందే వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. అయితే రైతుబంధుపై మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేయడంతో ఈసీ అనుమతిని నిరాకరించింది. దీంతో బీఆర్ఎస్ ఈసీ వద్దకు మరోసారి వెళ్లింది.

## బీఆర్ఎస్ లోకి భారీగా చేరికలు



**టీ మీడియా, నవంబర్ 27, పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణ కేంద్రానికి చెందిన సగరులు (ఉప్పరి) కులస్తులు బీఆర్ఎస్ లో భారీగా చేరారు. పెబ్బేరు మార్కెట్ యాడ్ మాజీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పెబ్బేర్ పట్టణ కేంద్రానికి చెందిన ఉప్పర కులస్తులు సగరులు, కటికె కులస్తులు దాదాపు 350 పైగా వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి జిల్లాకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎంతగానో సంతోషించి వనపర్తి అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు తెలిపారు. వీరందరికీ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు గా పెబ్బేరు సంత మార్కెట్ సమీపంలో గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనపర్తి ఎమ్మెల్యేగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని భీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- ఎంపీడీవో శివ నాగజ్యోతి



**టీ మీడియా, నవంబర్ 27, మహానంది:**
మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని సచివాలయం యందు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో శివ నాగజ్యోతి సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డు అవిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారన్నారు. అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## నిరాశతో ఉన్న కమలం శ్రేణులు

- సీనియర్లంతా సైలెంట్ • పార్టీ శ్రేణులలో గందరగోళం
- తిప్పికొట్టలేకపోతున్న జిల్లా నాయకత్వం



**టీ మీడియా, నవంబర్ 27, రేవల్లి :**
మండలంలో కొద్ది రోజులుగా బీజేపీ దూకుడు తగ్గిపోయింది. సీనియర్ నేతలంతా ఉన్నట్టుండి సైలెంట్ మూడ్ లోకి వెళ్లిపోయారు. దీంతో అసలు పార్టీలో ఏం జరుగుతున్నదో క్షేత్ర స్థాయి శ్రేణులకు అంతుబట్టడం లేదు. అంత బాగానే ఉందని పార్టీ ముఖ్యనేతలు పదేపదే చెబుతున్నప్పటికీ, అలాంటి పరిస్థితి ఏ మాత్రం కనిపించడం లేదని బీజేపీలోనే అంతర్గత చర్చ జరుగుతోంది. ఇన్నాళ్లు అధికార బీఆర్ఎస్ తో నువ్వా? నేనా? అంటూ బీజేపీ పోటీ పడింది. అనేక అంశాలలో నిరంజన్ రెడ్డి ను ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. అలాంటి పార్టీ ప్రస్తుతం ఎందుకనో ఒక్కసారిగా నెమ్మదించింది.ఈ పరిణామాలు మండల రాజకీయాలలో తీవ్ర చర్చాంశనీయంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ తో పాటు బీజేపీ ఉన్న చందంగా ఉంటాయని అంతా భావించారు. కానీ, ప్రస్తుతం కమలంలో నెలకొన్న పరిణామాలు చూస్తుంటే ఆ పార్టీ నేతలకే విశ్వాసం కలగడం లేదు. మండలంలో ఎన్నికల జంగ్ ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యకు షిఫ్ట్ అయిందా? అన్నట్లుగా ఉంది. జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞ రెడ్డి ఇటీవల మండలం లో పర్యటించారు. అయినప్పటికీ పార్టీ తీరు మారిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ ఎన్నికలలో బీజేపీ గ్రాఫ్ ఎంత స్పీడ్ గా పెరిగిందో అంతే స్పీడ్ గా పడిపోయిందన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. వనపర్తి ఓటమి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్పుతో బీజేపీ డీలాపడింది. ఎప్పుడూ కాంగ్రెస్ లో కనిపించే అంతర్గత కుమ్ములాటలు బీజేపీకి పాకాయి. ముఖ్యనేతలంగా 'ఎవరి వారే యమునా తీరే' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కీలక నేతలంతా మొక్కుబడిగా మీడియా సమావేశాలను నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దూకుడు మీదుంటే, బీజేపీలో మాత్రం ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చేరికల కోసం బిజెపిలో ప్రత్యేకంగా కమిటీ వేసినా ఉపయోగం లేకుండాపోయింది. మొదట రెండు సమావేశాలు నిర్వహించిన ఎన్నికల మేనేజ్ మెంట్ కమిటీ ఆ తర్వాత అతిగతి లేకుండా పోయింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎన్నికల సమయం ఇంటింటా ప్రచారంలో ఒకదానికి ఒకటి పోటీ పడుతూ ప్రచారాలు కొనసాగిస్తుంటే బిజెపి మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఎవరికి వారే యమునాతిరే విధంగా ఉండిపోయింది.

## రోడ్డు రోలర్ గుర్తుపై ఓటు వేసి వేయించాలి

- ఇండిపెండెంట్ అభ్యర్థి గంగవరం రామకృష్ణారెడ్డి



**టీ మీడియా, నవంబర్ 27, వనపర్తి బ్యూరో :**
ఘణపురం, సోలిపురము, బల్లెపల్లి, వీరయ్యపల్లి, అంకూరు, చిన్నగుంటపల్లి ప్రాంతాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి గంగవరం రామకృష్ణారెడ్డి తన రోడ్డుపై గుర్తుపై ఓటు వేసి వేయించాలని ఓటర్ మహాశయులను కోరారు.

## జోరుగా హుషారుగా డీఎస్పీ ప్రచారం

- అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలి జయలక్ష్మి



**టీ మీడియా, నవంబర్ 27, రేవల్లి :**
ధర్మ సమాజ్ పార్టీ జోరుగా హుషారుగా కొనసాగుతుంది. డీఎస్పీ పార్టీ బలపరిచిన అభ్యర్థి బంకల ఎల్లయ్య ను బ్యాటరీ గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని వారి సొంత సతీమణి జయలక్ష్మి ఇంటింటి ప్రచారంలో భాగంగా రేవల్లి, నాగపూర్, తలుపునూరు గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎల్ల స్వామి, మండల అధ్యక్షుడు చిన్న రాములు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి ఎల్ల స్వామి, కోశాధికారి కురుమన్న, శ్రీను, నరసింహ, విష్ణు, దాసు, యశోద, మల్లమ్మ, బాలరాజు, మహేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.